ఊహల తీగెలు - సిగ్గు దొంతరలు

సంక్రాంతికి రంగవల్లుల మధ్య పెట్టి పూజచేసిన గొబ్బెమ్మలను ఏ రోజు కారోజు గోడకు చరిచి, అవి ఎండగానే ఊడదీసి ఓ దారుకు గుచ్చి మేకుకు తగిలిస్తూ ఉంటుంది పద్మ. ప్రతిరోజూ పెరటిగోడకు కొట్టిన ఆ పిడకలు ఎండాయో లేదోనని వేలితో నొక్కిచూసి మళ్ళీ మళ్ళీ లెక్క పెట్టుకుంటూ ఉంటుంది.

"పద్మా" తల్లి కేకమీద కేక పెట్టింది.

ఆయాసపడుతూ లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చిన పద్మను "ఏం చేస్తున్నావు దొడ్లో?" తల నిమురుతూ లోపలికి తీసుకు వెళ్ళింది అన్నపూర్ణ.

పద్మకు తలదువ్వి బొట్టుపెడుతూ చెమ్మగిల్లిన కళ్లు కూతురి కంటపడకుండా ముఖం పక్కకు తిప్పుకుంది అన్నపూర్ణ.

"ఏమిటమ్మా ముఖం అలా తిప్పుకున్నావు?" తల్లి భుజాలను చేతులతో చుట్టివేసింది, పద్మ.

కడుపులో మసులుతున్న బాధంతా అణుచుకోటానికి ప్రయత్నిస్తూ "ఏం లేదమ్మా. నీవింకా ఇలా ఎన్నాళ్ళు గొబ్బెమ్మలు పెడతావు? నీకు పెట్టించే ఈడు వచ్చిందనుకుంటాను" కూతురు ముంగురులు సవరిస్తూ అన్నది అన్నపూర్ణ.

"అబ్బ ఎప్పుడూ పెళ్ళిమాటేనా? నన్ను చదువుకో నీయవా? నాకు అందరిలా ఒక డిగ్రీ రావద్దా?" అని బుంగమూతితో లోపలికి పరుగెత్తింది పద్మ.

"నా తల్లికి అందంలేదా? చదువు లేదా? ఎందుకు పెళ్ళికాదు? కళ్ళకద్దుకుని చేసుకుంటారు ..." అనుకుని ధైర్యం తెచ్చుకుంటుంది అన్నపూర్ణ. అన్నను పిలిపించి సంబంధాల కోసం దేశమంతటా తిప్పిస్తుంది. కొండంత ఆశతో ఎక్కిన గడపను రెట్టించిన భారంతో దిగి వస్తున్నాడు. "అమ్మాయికేం? కడిగిన

ముత్యంలా ఉంటుంది. కాని—తల్లిని ఎందుకో మొగుడు వదిలేశాడటగా ?'' అవి అనుమానిస్తున్నట్టుగా ఉంటున్నాయి వాళ్ళ సమాధానాలు. మేము ఆలోచించుకుని ఉత్తరం రాస్తామంటారు ప్రతివాళ్ళు. అంతే— ఆ తరువాత ఉత్తరం మాట అడుగున పడిపోతుంది.

ఆ సంగతి తలుచుకున్నప్పుడు అన్నపూర్ణ మనసు బాధతో మెలికలు తిరిగి పోతుంది

అన్నపూర్ణ చూపులు కిటికీలోనుంచి పచ్చికబయళ్ళ మీదికి పోయాయి అక్కడ నుంచి గోడకు తగిలించిన గొబ్బెదండ మీదికి ప్రసరించాయి. ఆ గొబ్బి పిడకలు రథ సప్తమినాడు సూర్యభగవానుడికి ఆరగింపుచేసే పొంగలికోసం ఆహుతి అయిపోతాయి. ప్రతి సంవత్సరమూ ఆ గొబ్బెమ్మల జీవితమంతే. కాని ఆ గొబ్బెమ్మ మోసుకువచ్చే మధుర వ్యథలు ఆమె జీవితంలో మరుపురానివి.

పేడనీళ్లు చల్లిన వాకిలిని సంక్రాంతి రంగవల్లులతో అలంకరించటమూ ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలకు పసుపు కుంకుమలతో బొట్టుపెట్టి బంతిపూలతో పూజలు చేయటమూ, స్నేహితురాళ్ళతో కలిపి గొబ్బి తడుతూ పాటలు పాడడమూ అన్నపూర్ణ జీవితంలో ఘట్టం.

గొబ్బెమ్మలకు పూజచేస్తున్న అన్నపూర్ణను చూసి తండ్రి మనసులో "నా తల్లికి మంచి వరుడు.... తగినవాడు రావాలి'' అనుకునేవాడు ఆయన ఊహలను కళ్ళతో చదివే అన్నపూర్ణ "పో—నాన్నా. నీకెప్పుడూ పెళ్లిమాటలే." అంటూ జడగంటలు ఊపుకుంటూ లోపలికి పరుగెత్తేది ఆమె వెళ్ళినవైపు అదోక మాదిరిగా చూస్తున్న తండ్రికి బుగ్గన చుక్క కళ్ళకు కాటుక, కాళ్ళకు పారాణి, ముఖాన కళ్యాణం బొట్టు, తలనిండా మల్లెలు, జరీ అంచుల పసుపు చీరె, చేతులనిండా పచ్చ గాజులతో అన్నపూర్ణ తలమీద అక్షతలు దులుపుకుంటూ "దీవించండి నాన్నా'' అంటూ ఎదురుగా నిలబడిన దృశ్యము కళ్ళకు కనబడేది. అటువంటి సమయాలలో ఆయనకు కలిగిన ఆనందం మాటలలో వ్యక్తం చేయలేనిది.

చలితో ముడుచుకుపోతూ ఒంటినిండా కొంగు కప్పుకుని చిరుచీకట్లలో లేచి ఆ వీధిలో అందరికంటే ముందుగా పేడ నీళ్ళు చల్లిన వాకిట్లో సంక్రాంతి ముగ్గులు తీర్చి స్వర్గద్వారాలను తెరిచి ఉంచేది అన్నపూర్ణ. ఈ పండుగకు ఆ వీధిలో అందరి ఇళ్ళకూ కొత్త అల్లుళ్లు వస్తుంటే ఆమె తండ్రికెంతో వెలితిగా ఉండేది. బల

మయిన కోరికలతో గుండెను ఊపివేసే సంక్రాంతి నూతన శోభతో వస్తోంది కదా? వస్తూవస్తూ తన కొంక అల్లుడిని తీసుకు రాకూడదా? తండ్రి హృదయం తల్లడిల్లేది.

పధ్నాలుగేళ్ళ అన్నపూర్ణకు ఏ దేవతో వరము ప్రసాదించినట్టుగా సుబ్బారావు వరుడై ఇంటికి చక్కా వచ్చాడు. పెళ్ళి తరువాత కూడా చదువు సాగించవలసిన సుబ్బారావు ఆమెను పుట్టింటనే ఉంచి వెళ్ళాడు. ఏ పండుగ వచ్చినా అత్త వారింటి పిలుపుకోసం ఎదురుచూస్తూ ఉండేవాడు. మామగారి ఆహ్వానం అందు కొని సంక్రాంతి సెలవులు వారం రోజులూ అతి మధురంగా గడిపి తిరిగి తన ఊరికి చేరుకునేవాడు. ఆ కలయిక ఆ ఎడబాటు తలుచుకుంటే యిప్పటికీ ఆమెకు ఒళ్లు జలదరిస్తుంది.

ఆ ప్రేమ—ఆ ఆప్యాయత నవనవలాడుతూ సుగంధ కుసుమాలు పుష్పించిన ఉద్యానవనంలా అతడిలో నవచైతన్యం మోసులెత్తించింది. అలా ఎన్ని సంక్రాంతులు ఎన్ని ఉగాదులు మధురాతిమధురంగా గడిచిపోయాయో లెక్కలేదు.

ఉల్లాసంతో సంతోషంతో గడిపిన కాలం సంవత్సరాలయినా క్షణాలవలె తోస్తుంది సుగంధ కుసుమాలను వెదజల్లిన తమ మధురానుభవాలు కాలగర్భంలో కలిసిపోయాయి. అన్నపూర్ణ నిండు గర్భిణి. కళ్ళనీళ్ళతో సుబ్బారావును సాగనంపుతూ "త్వరలో వచ్చి పాపాయిని చూసుకుంటారు కదూ?" అన్నది అతడి కళ్ళల్లోకి చూస్తూ. కాని అతడు రాలేదు. అతడు ఏదో సందర్భంలో తన సహాధ్యాయిని కమల చాలా చురుకైనదనీ, ఎంతో అందమైనదే కాకుండా నవనాగరికత కలదని చెప్పాడు. బహుశః ఆ పడుచుపిల్ల అతడి నాకర్షించి ఉంటుంది. ఆ పిల్ల మోజులో పడిపోయాడు. తండ్రి ఉత్తరంమీద ఉత్తరం నిష్ఠూరంగా వ్రాయగా వచ్చి పిల్లను సరిగా చూడనైనా చూడకుండా మళ్ళీ వెళ్ళిపోయాడు.

కాలచక్రం ఇటువంటివాటి నెన్ని చూసిందో? ఇంకెన్ని చూడనున్నదో? తన సంగతి ఆ మహా వెల్లువలో ఒక గడ్డిపోచ అంతైనా లేదు అయినా తన బాధ తనది. తను పరిత్యక్త. తన కూతురికి పెళ్ళి ఈడు వచ్చింది. కాని— చూస్తూ చూస్తూ పరిత్యక్త కూతురి నెవరు చేసుకుంటారు? తను చెయ్యని పాపం తన బిడ్డను కూడా బాధిస్తుంది కాబోలు? అయితే పాపపుణ్యాలెరుగని తన బిడ్డ గతేమిటి?

ఆమె కన్నీటిబొట్టొక అక్షరంగా ఎన్నో ఉత్తరాలు ఎదుగుతూ ఉన్న బిడ్డ ఫోటోలతో కూడా అతనికి వారానికి రెండు వంతున చేరుతున్నాయి. కాని ఒక్కదానికీ జవాబులేదు. బహుశః ఆ సహాధ్యాయిని—— ఆ పడుచుపిల్ల కమల—— దాని వలలోనే చిక్కుకుపోయి ఉంటాడు. భార్య దగ్గరనుంచి వచ్చిన ఉత్తరాలు విప్పి చదువుతున్నాడో లేదో? ఆ ఉత్తరాలన్నీ ఒక మూల గుట్టగా పడి వాటిమీద అర చేతి మందం దుమ్ముపడి ఉంటుంది.

అన్నపూర్ణ హృదయం బీటలు వారింది. ప్రాణాలు కళ్ళల్లో ఉన్నాయి. దేహం వాడి పత్తి అయింది

రోషం అభిమానం చంపుకుని పదహారేళ్ళ పద్మ ఫొటో కవరులో పెట్టి పంపుతూ సుబ్బారావుకొక ఉత్తరం వ్రాసింది.

"నా జీవనలత ఎండిమోడయిపోయింది. నేనెవరినో మీకు జ్ఞప్తికి వచ్చి ఉండదు. మీకది పూర్వజన్మలా ఉంటుందేమో నేను జ్ఞాపకం చేస్తే? ఆనాటి మన బిడ్డ పెరిగి పదహారేళ్ళ పడుచయింది. తల్లిగా నా బాధ్యత ఏమిటి? నా కర్తవ్యాన్ని నాకు తెలియబరచండి. మీ జాబుకోసం చకోరంలా ఎదురుచూస్తూ ఉంటాను...." ఈ ఉత్తరం పోస్టులో వేసి జవాబుకోసం నిరీక్షిస్తూ బ్రతుకుతోంది అన్నపూర్ణ.

రాలేదు——అతడి దగ్గరనుండి ఒక్క జాబైనా రాలేదు. "ఏమో సంక్రాంతికి వస్తాడేమో?" ఆశ చిగురించింది. చదువుకునే రోజుల్లో ఒకసారి ఉత్తరం రాయకుండా హఠాత్తుగా వచ్చాడు.

తను పక్కయింటి నీలవేణితో ఆ కిందటి రోజు పందెం వేసుకుంది. నీలవేణి కంటె ముందుగా లేచి, పదహారు వాకిళ్ళలో పెద్ద ముగ్గువేసి గొబ్బెమ్మలు పెడతానని అన్నపూర్ణ పందెం వేసింది ఓడిపోతే అన్నపూర్ణ ఐదు రూపాయలు నీలవేణికి ఇచ్చుకోవాలి. అన్నపూర్ణ తెల్లవారుఝామున చలికి బిగదీసుకుపోతున్న దేహాన్ని స్వాధీనం చేసుకుని ఊడ్చి పేడనీళ్లు చల్లిన వాకిట్లో వొంగి ముగ్గులు వెయ్యటం మొదలు పెట్టింది. ముగ్గు పూర్తిచేసి గొబ్బెమ్మలు పెట్టి గెలిచినట్టుగా నీలవేణీ అంటూ కేక వెయ్యాలని తొందరపడుతూ చుక్కలు పెట్టింది. తప్పు వచ్చినచోట కాలితో చెరిపి మళ్ళీ చుక్కలు పెడుతోంది. ఒంగి ఎప్పుడువచ్చాడో సుబ్బారావు——వెనక నుంచి వచ్చి జడపట్టుకున్నాడు. భయంతో కెవ్వున కేక

వెయ్యబోయి అతడిని చూసి ముగ్గు డబ్బా అక్కడ పడేసి లోపలికి పరుగెత్తింది జడలాక్కుంటూ. కబుర్లూ మధ్య మధ్య నిష్ఠూరాలూ, నిందలూ, అలకలూ, నవ్వులూ బ్రతిమిలాటలతో వాకిట్లో ముగ్గూ పందెం మాట మరిచిపోయింది అన్నపూర్ణ.

నీలవేణి లేచి అసంపూర్తిగా ఉన్న అన్నపూర్ణ వాకిలిని చూసి నవ్వుకుంది. అయిదు నిమిషాలలో తన పని పూర్తి చేసుకుని "అన్నపూర్ణా" అంటూ కేక పెట్టింది.

"అయ్యో నేను ఓడిపోయాను. నీలవేణి పందెం గెలిచింది. ఐదు రూపాయలివ్వాలి.'' గదిలో నుంచి బయటికి రావటానికి ప్రయత్నించి విఫలురాల యింది అన్నపూర్ణ. ఆమె ఓడిపోయిన ఐదు రూపాయలు సుబ్బారావు తన జేబులో నుంచి తీసిచ్చాడు.

అప్పటి మాదిరిగా చెప్పా పెట్టాకుండా వస్తాడేమో ఇప్పుడు కూడా!

అప్పటి సంగతి జ్ఞాపకంరాగానే అన్నపూర్ణ హృదయం పిల్లిగంతులు వేసింది. చెంపలు ఎరుపుకు తిరిగాయి. ఏమో అప్పటి మాదిరిగా ఇప్పుడు రాకూడదూ? తెల్లవారు ఝామున మెలకువతోనే ఉండి తలుపు దగ్గరగా మంచం లాక్కుని పడుకోవటం మొదలుపెట్టింది. అలా బరువుగా ఒకవారం గడిచింది.

సాయంకాలము నాలుగు గంటలయింది మధ్యాహ్నం కాఫీ తాగిఅరమోడ్పు కళ్ళతో గోడకానుకుని కూర్చున్నది అన్నపూర్ణ. ఆమె మనసు ఎక్కడెక్కడో విహరిస్తోంది. ఓరవాకిలిగా వేసి ఉన్న తలుపు నెట్టుకుని—నల్లసూటు నల్ల కళ్ళద్దా లతో సుబ్బారావు సూట్‌కేసు చేత బట్టుని లోపలికి వచ్చాడు.

దిగ్భ్రాంతురాలయి కళ్లు పెద్దవి చేసుకుని చూస్తోంది అన్నపూర్ణ దిగ్గునలేచి నిలబడి.

"అదేమిటి? అలా చూస్తున్నావు? ఒంట్లో బాగుందా?" సూట్‌కేసు కింద పెట్టి ఆమె బుజాలు పట్టుకుని ఊపాడు సుబ్బారావు.

"అబ్బ ఎన్నాళ్ళకు వచ్చారు: ఎంత కాలానికి మిమ్మల్ని చూడగలిగాను?" ఈ మాటలనాలని ఆమె ఎంతో ప్రయత్నించింది. కాని—నాలుకమడతబడిపోయింది.

"ఏమిటి పూర్ణా ఇలా ఉన్నావు....? పద్మ ఏదీ?" అంటూ అతడు పెట్టెతీసి అన్నపూర్ణకోసం తెచ్చిన బట్టలూ పద్మకోసం తెచ్చిన బొమ్మలూ బయట పెట్టాడు.

ఆరేళ్ళ పద్మ ఎగురుతూ గంతులువేస్తూ వచ్చి "నాన్నా నాకేం తెచ్చావు....?" అని కాళ్ళకు చుట్టుకుంది

"ఏమిటి పూర్ణా. పిచ్చిదానిలా అలా చూస్తావేం? లేచి కాఫీ టిఫిన్ తీసుకు రావేం? నేను వెళ్ళి రెండు నెలలు కాలేదు. వెళ్ళేటప్పుడు ఇన్నాళ్ళవుతుందని చెప్పేనుగా. లేవే నాకు ముందు అర్జంటుగా కాఫీ కావాలి...." అతడు బట్టలు మార్చుకుని కాళ్లు కడుక్కోవటానికి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

అన్నపూర్ణ యాంత్రికంగా లేచి వెళ్లి కాఫీ చేసుకు వచ్చింది. తలవంచుకుని కాఫీ కప్పు బల్లమీద పెట్టి గోడ కానుకుని నిలబడ్డది.

ఆమెకు మెల్ల మెల్లగా కళ్లు విప్పుకుంటున్నాయి.

ఇదేమిటి? పద్మ ఆరేళ్ళ పిల్లేనా? ఏమిటి మనోవేదన? తన గుండెను కరకర నమిలి మింగేస్తున్న వేదన కర్థమేమిటి? నిజంగా అతడు వెళ్లి రెండు నెలలు ఇంకా కాలేదా? దీర్ఘ కాలమనిపించి తన గుండె బీటలు వారిందే? ఎదిగిన బిడ్డను చూపి అంత బాధపడిందే తన మనసు?

అన్నపూర్ణ గుండెమీద చెయ్యి వేసుకుని కళ్లు మూసుకుని బరువుగా నిట్టూర్చింది.

"నీ బాధ ఏమిటో నాకు చెప్పు?" అతడు ఆమె గడ్డం పట్టుకుని ముఖం పైకెత్తి కళ్ళలోకి చూశాడు.

ఆతడి గుండెమీద తలవాల్చి ఆమె తన కడుపులో మసలుతున్న సొదంతా వెళ్లబోసుకున్నది.

అతడు పకపక నవ్వాడు....ఆ నవ్వులో 'మొత్తానికి ఆడదానివనిపించావు' అన్న హేళన తోచిం దామెకు. సిగ్గూ, రోషం ఆమెను పెనవేసుకుపోయాయి. ఊఁ అంటూ బుంగమూతితో ముఖం అదోలా పెట్టింది.

అతడు నవ్వుతూ "పూర్ణా నీ ఊహలు తీగెల్లా ఎంత దూరం సాగాయి? ఇంకా నాలుగు రోజులు ఆలస్యము జరిగి ఉంటే నీవు నాకు దక్కి ఉండవు...." ఆమెను గాఢంగా గుండె కదుముకున్నాడు.

అతడి షర్టుకు అంటిన కుంకుమ దులుపుతూ "రెండు నెలల్లో పదహారేళ్ళ బాధ అనుభవించాను. మనసు పాదరసంలా పరుగులెత్తింది. ఏమేమో ఊహించు కున్న నా మనసు బాధతో మెలికలు తిరిగిపోయింది." ఆమె సన్నగా గొణిగిన మాటలతో ఒక్కటయినా స్పష్టంగా అతడికి వినబడలేదు.

"నీ ఊహల కెంతశక్తి ఉన్నదో గ్రహించగలిగాను" సుబ్బారావు చెదరిన ఆమె ముంగురులు సవరించాడు. ఆమె ఆనంద బాష్పా లని చెప్పిన కన్నీటిని తుడిచి చెంపకు పెదవు లానించాడు.

ఆరేళ్ళ పద్మ మళ్ళా వచ్చింది ఎదురుగా అన్నపూర్ణ ఊహలను చెదరగొడుతూ ''అమ్మా నా బొమ్మలేవీ....?'' అంటూ.

పద్మ వేసుకున్న గౌనువంకా చెదరిన రెండు జడల వంకా వెర్రిచూపులు చూసింది అన్నపూర్ణ. పద్మకు ఆరేళ్లు. అతడు వెళ్లి రెండు నెలలు కాలేదు!

చటుక్కున తలదించుకుంది అన్నపూర్ణ.

(పంచాయతీ ప్రభుత్వ మాస పత్రిక)